క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరుకు చెందిన ఫణిభూషణంశర్మకు శ్రీజ్వాలా బ్రాహ్మణ మిత్ర ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఫణిభూషణంశర్మ తండ్రి ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ట్రస్ట్ నిర్వాహకులు నగదును ఆయన మిత్రుడు దత్తు ద్వారా వారి కుటుంబానికి అందించాలని ట్రస్ట్ నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యే పెళ్లికానుక అందజేత



వధువు తల్లిదండ్రులకు పెళ్లికానుక అందజేస్తున్న ఎంపీటీసీ భాస్కర్‌యాదవ్

రామచంద్రాపురం: రావిళ్లవారిపల్లి పంచాయతీ బ్రాహ్మణకాల్వ గ్రామంలో వివాహం చేసుకోనున్న వధువు స్నేహ తల్లిదండ్రులు బుజ్జమ్మ, రవిలకు ఎంపీటీసీ భాస్కర్‌యాదవ్, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నరేష్ మంగళవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లికానుకను అందజేశారు. వధూవరులకు పట్టు వస్త్రాలు, బంగారు తాళిబొట్టు, మెట్టెలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అపూర్వ స్వాగతం

తిరుపతి మంగళం: చిత్తూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం తిరుపతి విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, విరూపాక్షి జయచంద్రారెడ్డి, చొక్కారెడ్డిగారి జగదీశ్వరరెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అపూర్వస్వాగతం పలికారు.







వైద్యశిబిరాలకు విశేష స్పందన

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలకు గ్రామీణుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దోర్నకంబాల, గంగుడుపల్లిలో జరిగిన వైద్యశిబిరంలో ఎక్కువ మంది ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నట్లు సర్పంచ్ గౌతమి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పసల నాగరాజు తెలిపారు. గ్రామానికే వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యపరీక్షల రిపోర్టులను త్వరలోనే అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. సోను, మురళిరెడ్డి పాల్గొన్నారు.

నేడు చంద్రగిరిలో...

చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న వైద్యశిబిరం బుధవారం చంద్రగిరి టౌన్‌లో ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగిరిలో బాలురు, బాలికల కళాశాల, జీఆర్‌కేఆర్ పాఠశాల, కావమ్మ గుడి వీధి ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉచితంగా అందించే ఈ సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో ఆయన కోరారు.



దోర్నకంబాలలో వైద్యపరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగరాజు

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి భవానీనగర్‌కు చెందిన బి.గోపినాథ్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి బి.వాణిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది తరఫు న్యాయవాది ఎంఎస్.మణి తెలిపిన కేసులోని వివరాల మేరకు తిరుపతి భవానీనగర్‌కు చెందిన కె.ప్రసాద్ అనే వ్యక్తి వద్ద గోపినాథ్‌రెడ్డి తన అవసరాల కోసం 2018 ఏప్రిల్‌లో రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్మును చెల్లించే క్రమంలో గోపినాథ్‌రెడ్డి అదే ఏడాది జూన్‌లో ఓ చెక్‌ను ప్రసాద్‌కు ఇచ్చాడు. ఆ చెక్ బ్యాంకులో బౌన్స్ అయింది. దీంతో అతను కోర్టులో గోపినాథ్‌రెడ్డిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గోపినాథ్‌రెడ్డికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వేడుకగా గంగజాతర



పూజల్లో శివశంకర్‌రాజు, శ్రీనివాసులురెడ్డి

తిరుపతి మంగళం: మంగళంలోని తిరుమలనగర్‌లో మంగళవారం వేడుకగా గంగజాతర నిర్వహించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు, పార్టీ నేత ఎం. శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

పర్యాటక కేంద్రంగా వినాయకసాగర్

తిరుపతి తుడా: వినాయకసాగర్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషన్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి తెలిపారు. సాగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పనులను శరవేగంగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మున్సిపల్ ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయ్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనిల్ కుమార్ పాల్గొన్నారు

మా భూములు కాపాడండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): 'నలభై ఏళ్ల క్రితం ఆ భూములను దళితులకు ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పుడు గురవారెడ్డి వచ్చి ఆ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడు. గురవారెడ్డి నుంచి మా భూములను కాపాడండి' అంటూ మఠంపల్లికి చెందిన దళితులు వేడుకున్నారు. మంగళవారం చంద్రగిరి తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందించారు. దళిత నేత బాలకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం పిచ్చినాయుడు పల్లి లెక్క దాఖల సర్వే నంబర్ 1505/4లో 25 మంది దళితులకు 50 ఎకరాలను ప్రభుత్వం డీకేటీ పట్టాలను మంజూరు చేసిందన్నారు. దొంగపట్టాలను సృష్టించిన గురవారెడ్డి భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. స్పందించిన తహసీల్దార్ శిరీష దళితుల భూముల్లోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

పాకాల: నేంద్రగుంట రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సుగల వ్యక్తి గుర్తుతెలియని రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు ఒంటిపై బూడిద రంగు పూలపూల ఫుల్ షర్ట్, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు ఆదర్శనీయులు



అల్లూరికి నివాళులర్పిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

– మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: భారతావని కోసం బ్రిటీషు వారిపై పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మనందరికి ఆదర్శనీయులని నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అల్లూరి 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నుంచి మనమెంతో నేర్చుకోవాలని, గిరిజన ప్రాంత ప్రజల కోసం ధైర్యంతో బ్రిటీష్ వారిపై పోరాడిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, ఆరణి సంధ్య, నరేంద్రనాథ్, కోటూరు ఆంజినేయులు, బోకం అనిల్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

తిరుపతి క్రైం: అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఆర్ ఏఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాధారంగా మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అనంత వీధిలోని కార్యాలయంలో మంగళవారం వంగవీటి రంగా, అల్లూరి సీతారామరాజుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రతినిధులు బెల్లంకొండ సురేష్, జన్నాథం, గోపిప్రసాద్, రెడ్డెప్పరెడ్డి, జ్ఞానేశ్వరి, పద్మ, భానుప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా సాయిబాబా పల్లకీ ఊరేగింపు

తిరుపతి కల్చరల్: కొంకా వీధిలోని ద్వారకామాయి షిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ఆలయంలో గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి సాయిబాబా చిత్రపటం పల్లకీ ఊరేగింపు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయంలో సంకీర్తనల భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం త్యాగరాజ మండపంలో అన్నదానం చేశారు. రాత్రి సాయిబాబా చిత్రపటాన్ని పల్లకీలో కొలువుదీర్చి పురవీధుల్లో వేడుకగా ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు ముబ్బు దేవనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, రవి, రమేష్, దుర్గం శ్రీనివాసులు, శివ, విజయలక్ష్మి, కళావతి పాల్గొన్నారు



కళ్యాణదుర్గం రైలెక్కిన మంత్రి ఉషశ్రీ చరణ్

పాకాల: స్థానిక రైల్వేస్టేషన్‌లో స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మంగళవారం అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలెక్కారు. అమూల్ పాల డెయిరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రితోపాటు హాజరై కార్యక్రమాన్ని ముగించుకుని పాకాల రైల్వేస్టేషన్ నుంచి తన సొంత నియోజకవర్గం కళ్యాణదుర్గానికి ప్రయాణమయ్యారు.



పాకాల రైల్వేస్టేషన్‌లో మంత్రి ఉషశ్రీ చరణ్

సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష

– ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ఫిష్ మార్కెట్ ప్రాంతంలో ధ్రువీకరణపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా ఉండి కొన్ని ధ్రువీకరణ పత్రాలు లేవనో, సాంకేతిక సమస్యలు ఉన్నాయనో పథకాలు అందుకోకుండా దూరం కాకూడదన్న సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఇందిరా మైదానం, ఫిష్ మార్కెట్, శెట్టిపల్లి ప్రాంతాల్లో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు అందించేందుకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించిన దాఖలాలు ఇప్పటివరకు లేదని చెప్పారు. వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన మొనగాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎంది మంచి మనసు కాబట్టే నిత్యం అన్ని వర్గాల పేద ప్రజల ఉన్నతి కోసం ఆలోచిస్తుంటారన్నారు. భవిష్యత్తులో పేదలందరికీ మంచి జరగాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న జగనన్నను మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. దశాబ్దాలుగా శెట్టిపల్లి వాసుల సమస్యకు పరిష్కారం చూపలేకపోయారన్నారు. తాము అధికారంలోకి వస్తే శెట్టిపల్లె భవిష్యత్తు మారుస్తామని ఇచ్చిన హామీ మేరకు శరవేగంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ఉద్యమ తరహాలో ధ్రువీకరణ పత్రాలు సంక్షేమ పథకాలను అందించేందుకు జగనన్న సురక్ష పేరుతో మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని నగర ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలకు ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులను వెతికి వెతికి మరి ఆ కుటుంబానికి మంచి చేసేందుకు తాము నిత్యం ప్రయత్నిస్తూనే ఉన్నామన్నారు. శెట్టిపల్లి భూముల సమస్యకు అతి త్వరలో పూర్తిస్థాయి పరిష్కారం లభించనుందన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రావణి, దూదికుమారి, మునిరామిరెడ్డి, తిరుత్తణి శైలజ, ఆంజినేయులు, నరేంద్రనాథ్, కో ఆప్షన్ సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, ఇమామ్ సాహెబ్, సూపరింటెంట్ రవి, డివిజన్ నాయకులు బాలిశెట్టి కిశోర్, మునిరామిరెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, గీతా యాదవ్, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పనపాకం, నరసింగాపురం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం గ్రామసభలు నిర్వహించారు. పనపాకంలో జరిగిన గ్రామసభలో హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో ఈ పథకం ప్రవేశపెట్టారని, ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ లబ్ధిపొందాలని సూచించారు. అనంతరం జగనన్న సురక్ష పథకం ద్వారా పనపాకంలో 339 మందికి, నరసింగాపురంలో 348 మందికి మొత్తం 787 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డెప్ప, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యులు అశ్విని, ఔరంగజేబు, సర్పంచ్ చెంచురత్నం, ప్రకాష్‌రెడ్డి, నేతలు చెంగల్రాయులు, ప్రవీణ్‌కుమార్, హరి, ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ శిరీషా పాల్గొన్నారు.





గాంధీపురంలో ధ్రువపత్రాలను అందిస్తున్న లక్ష్మీశివ, ధ్రువపత్రాలను అందజేస్తున్న హర్షిత్‌రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్



కేకేవీపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు

తిరుపతి రూరల్: ప్రభుత్వ సేవలను గడప గడపకూ చేర్చుతూ దేశంలోనే విప్లవాత్మక మార్పులకు జగనన్న సురక్ష కార్యక్రమం నాంది పలుకుతుందని గాంధీపురం సర్పంచ్ మన్నూరు లక్ష్మీశివ కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాంధీపురం, పద్మావతిపురం పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. వివిధ సేవలకు సంబంధించి ఒక్కరోజులోనే 1,180 సర్టిఫికెట్లు, ధ్రువపత్రాలను అక్కడికక్కడే అందజేశారు. పద్మావతీపురం సర్పంచ్ జ్యోతి, ఎంపీడీఓ వెంకటనారాయణ, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, డీఎల్‌పీఓ రూపారాణి, ఈఓపీఆర్డీ గిరిధర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

భాకరాపేట: జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. చిట్టేచెర్ల సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, ఈఓపీఆర్డీ, మదనమోహనరాజు, డిప్యూటీ తహసీల్దార్ అన్వర్‌బాషా, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, రోజారాణి, నేతలు నాగ చెంగమనాయుడు, సీతాపతి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలనలో నూతన సంస్కరణలు

ఎర్రావారిపాళెం(భాకరాపేట): ప్రజలకు సురక్షితమైన పాలన అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఉస్తికాయలపెంట సర్పంచ్ రమేష్ అన్నారు. మంగళవారం ఉస్తికాయలపెంట గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపీడీఓ అమర్నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

పాకాల: జగనన్న సురక్షలో లబ్ధిపొందేందుకు అర్హతే ప్రామాణికమని తహసీల్దార్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం దామలచెరువు, సామిరెడ్డిపల్లి పంచాయతీల్లో సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అవసరమైన వారికి ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఎంపీపీ లోకనాథం, ఎంపీటీసీ నాగూర్‌బి, సర్పంచ్‌లు సునీత, అమరావతి, ఎంపీడీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

రామచంద్రాపురం: జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేకేవీపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న సర్పంచ్



పాకాల: ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న నేతలు